తమ సైన్య సంపదను, యుద్ధ పాటవమును బయట పెట్టాలి. కేవలం శాంతి భద్రతలకు కావలసినంతవరకే సైన్యాన్ని ఉంచుకోవాలి. ఇందుకు ఇరుపక్షాలు అంగీకరిస్తవా? ముఖ్యంగా రష్యావైపునుండే మధ్యవర్తిత్వం అంటే ఎక్కువ వ్యతిరేక భావం కనబడుతున్నది. ఐక్యరాజ్య సమితిలో నమ్మకం లేకపోతే కొన్ని మిత్ర దేశాలతో ఒక మధ్యవర్తిత్వ సంఘాన్ని నియమించుకోవచ్చును. మనసుంటే మార్గం లేక పోదు. కేవలం మాకు మాలో తప్ప మరి యెవరిలోనూ నమ్మకం లేదంటే అది సామరస్యానికి మార్గం కాదు.

ఇక తటస్థ వాదులకు ఒక మాట. ప్రపంచ శాంతి కాపాడాలంటే యే మతాలోను చేరనంతమాత్రాన సరిపోదు. ప్రజలు యే మతామాయలోను పడిపోకుండా చూడాలి. రెండు మతాలవారికి ప్రజలు తమతో లేరన్న నమ్మకం కలగాలి. అప్పుడు వారు యుద్ధానికి సాహసించలేరు. ప్రపంచ ప్రజాభిప్రాయం తమకు అనుకూలంగా ఉన్నదని యే పక్షానికైనా నమ్మకం కలిగితే అది యుద్ధానికి తలపడే ప్రమాదముంది. కేవలం రాజకీయ కారణాల మీదనే దృష్టిని కేంద్రీకరించరాదు. సాంఘిక ఆర్థిక అన్యాయాలను తొలగించేందుకు కృషి చేయటం ముఖ్యం. ఈ కృషి లేనిదే ప్రపంచ శాంతి రాదు.

ఐతే యింతవరకు యీ మూడోవర్గపు కృషి సంతృప్తికరంగా లేకపోవటానికి రెండు ముఖ్య కారణాలున్నవి. 1. ఈ మూడో వర్గానికి తక్కిన రెండు వర్గాలకు ఉన్న ప్రభుత్వ అండదండలు లేవు. ఉన్నతస్థాయిలో యీ కృషి ప్రారంభం కాలేదు. నిర్మలమైన మనస్సుతో ఆలోచించగల కొద్దిమంది మేధావులు యీ భారాన్నంతా నెత్తిన వేసుకో వలసి వస్తున్నది. 2. తక్కిన రెండు వర్గాల తాకిడిని యీ మూడో వర్గం యెదుర్కోవలసి వచ్చింది. తమతో చేరనివారంతా తమ శత్రువులేనన్న ధోరణిలో రష్యా అమెరికా వర్గాలు ప్రవర్తిస్తున్నవి. అమెరికా కూటమువలన, రష్యా కూటమువలన కూడా స్వేచ్ఛావాయువులకు ఆటంకం యేర్పడుతుందని మూడోవర్గానికి చెందినవారు యేనాడో గ్రహించారు. ఏది యేమైనా మానవ స్వేచ్ఛారక్షణ యీ వర్గపు విజయముమీదే ఆధారపడి ఉంది.

కథానిక

# ఏకాకి అనంతం

కృష్ణ ప్రసాద్

కాపురానికి వెళ్ళడంతో జానకికి నూతన జీవితం ప్రారంభమైంది. అందరి ఆడపిల్లలాగే జానకి కూడా ఏవో సంసార సౌఖ్యాలని మనసులో ఊహించుకుని వెర్రి కోర్కెలతో భర్త సన్నిధిని కాలు పెట్టింది.

అనంతం ఒక విచిత్రవ్యక్తి. ఇంచుమించుగా శీలం, నిబ్బరంలేని చంచలమనస్కులైన యువక బృందంలో ఒకడు. అనంతం రుచులకూ, భావాలకూ, ప్రవర్తనకూ, ఒక అర్థమూ పర్థమూ, తీరూ తెన్నూ కనబడవు.

కాపురం ఆరంభంలోనే జానకి ప్రణయ ఘట్టాలకు బదులు ప్రళయ ఘట్టాలని చవిచూడవలసి వచ్చింది. జానకి సరదాగా, చలాకీగా జీవితం గడపాలన్న ప్రయత్నం అనంతం యీసడించుకునేవాడు. జానకిగుడ్లలో నీళ్లు గుడ్లలోనే కుక్కుకునేది. ఏవో శృంగార భావాలు పెనవేసుకున్న హృదయంతో చిరునవ్వులు కురిపించేది. మాట్లాడబోయేది. అతను అర్థం చేసుకోలేక పోయేవాడు. అసహ్యించుకుంటున్నట్లు చూసేవాడు. తాను కృంగిపోయేది ఆవేదనతో.

అతని భావంలో భార్య భర్త పెత్తనానికీ మురికి చాకిరీకి మాత్రమే. జానకి యెదటనే జానకికి వినబడేటట్లే, స్నేహితులతో-సినిమా తారల అందాలని తెగ పొగడ్తూ, మూర్ఛలు పోయేవాడు.

జానకి కాపురంలో అడుగుపెట్టిన నాటి

నుంచీ ఏదో తప్పుచేసిన దానివలె బాధపడేది. మొహం పాలిపోయి జీవకళ తగ్గింది. ఈ పొరపాటు యెక్కడుంది? తనకు తెలియదు. తనకు చెప్పేవారు కూడా లేరు! అసలు జీవితమంతా ఇంతేనా? గృహిణీత్వం అంటే చైతన్య రహిత జీవనమేనా?

కాని సంఘంలో భార్యల్లో ఒక వర్గమే యీ బాధపడేది. ఇంకొక వర్గం భర్తలమీదనే అధికారం చలాయిస్తుంది. ఈ తారతమ్యానికి కారణం ఏమిటో జానకికి అర్థం కాలేదు.

నోరు తెరచి పలుకవలసిన అగత్యం వస్తే, జానకి తన భర్తయెదట, తన అత్తమామలూ ఆడబిడ్డల యెదుట-తన పుట్టింటి రోజుల సౌఖ్యాన్ని గూర్చిన ప్రస్తావనలో క్షణకాలం ఊహామాత్రంగా పరవశమైయేది. అటువంటప్పుడు అనంతమే కాదు అత్తింటివారంతా పీడించేవారు. ఆ రోజున యిల్లంతా ధుమధుమలే. ఎప్పుడైనా పుట్టింటికి పోతే తల్లి ఆతృతగా తన వివాహ జీవితం గురించి అడిగేది. తానేం చెప్తుంది? తల్లి బాధపడుతుందేమోనని భర్త తనని ఎంతో అప్యాయంగా చూసుకుంటున్నాడని చెప్పేది. అట్లా చెప్పకపోవడం తనకే లజ్జాకరం. కూతురు సౌఖ్యపడుతోందని తలితండ్రులు సంతోషించేవారు.

రానురాను, అనంతం స్వేచ్ఛావిహారి అయినాడు. చేసేందుకు పనిలేదు. చేయటానికి అంతకంటె యిష్టంలేదు. గొప్ప జీవితాన్ని అనుభవించాలని సరదా. పేక, సినిమాలు, స్నేహ బృందమూ సిగరెట్ పొగలలో జీవితాన్ని పంచరంగులచిత్రంలాగ చూడసాగాడు.

ఆతని కంటికి, జానకి కాలంగడిచే కొద్దీ ఒక ‘కోతి’ లాగ కనపడ్తూన్నట్లు చరించేవాడు. అడుగడుగునా ఏదో లోపం వెదికి గోరంతలని కొండంతలుగా చేసేవాడు. దానితో ఇంట్లో తనకీ-జానకికీ సౌఖ్యంగాని, శాంతిగాని లేదు. తిట్టేవాడు, పరిహాసించేవాడు. పరాయి ఆడవాళ్ళని ఏదో నెపంతో పొగడ్తూ, స్మరిస్తూ వుండేవాడు. కనీసం కొంతమందితోనైనా తనకు సంబంధంవున్నట్లు నటించసాగాడు, జానకి ఎదట. జానకి మొదట మొదట దుఃఖించింది. తర్వాతతర్వాత ఆక్రోశించింది. రాను రాను మొద్దుబారింది. తనలోపం ఏమిటో చెప్పమని భర్తని చాలాసార్లు అడిగింది. అడిగిన కొద్దీ బాధపెట్టేవాడు. యీసడించేవాడు. విసుగెత్తిపోయేది. మౌనం వహించేది.

రానురాను జానకి నీరసపడింది. తిండికూడా సహించేది కాదు. మానసికవ్యాధితో మంచానపడింది. ఆ ‘దాసి’ మీద కోపానికి అనంతానికి అంతకంటె కారణం ఏం కావాలి? రోజల్లా హోటలులోనో థియేటరులోనో కాలక్షేపం

జానకిపోతే? తానింకొక పెళ్ళి చేసుకుంటాడు. ధైర్యం చెప్పుకునేవాడు. ఒక్కొక్కప్పుడు జానకికి వినబడేటట్లే నోరు జారి అనేవాడు కూడాను. మళ్లీ చప్పున అందరూ జానకిలాంటి వాళ్ళేమోనని, జానకిలాగే అందర్నీ తాను అసహ్యించుకోవలసి వస్తుందేమోనని భయం కూడా కలిగేది.

జానకికి ఎవరూ ఉపచారం గాని, మందూ-మాకూ యిచ్చే అవసరం గాని, ఆసరాగాని కనపడలేదు. ఈ కత్రృత్వం ఇంటిల్లపాదికీ అలుముకోవటానికి కారణం ప్రబలంగా ఎవరికీ కనబడదు. ఎవరూ గట్టిగా చెప్పలేరు. అసలు అనంతానికే తెలియదు. (జానకి ‘మెత్తదనమే’ కావచ్చునేమో. స్త్రీ, పురుషుణ్ణి దాసుణ్ణి చేసుకోవడానికి, కీలకం ఎరగకపోతే-నరకయాతనకి సిద్ధపడాలని,మానసికవేత్తల అభిప్రాయం.)

* * *

జానకి ప్రసవించింది. పుట్టిన శిశువూ,జానకీ అనంతానికి దూరమైనారు. ప్రసవానంతర నిస్తబ్ధతలో చిరుహాసంతో అనంతాన్ని చూస్తూ జానకి మెల్లగా పెదవులు ఆడించింది: “సౌఖ్యంకోసం ఆరాటపడే ఆడది మగవాడికి దాసి కావటం తప్పనిసరని అర్థమౌతోంది. భార్య వేరే ఒక జీవి కాదనీ, హృదయం లేదనీ భావించి దాసీత్వాన్నే తప్ప, యితరాన్ని చూడలేని భర్తతో జీవితం ‘నరకం’. నా నేరం నుంచి యీ పసిగుడ్డు కూడా తప్పుకున్నందుకు సంతోషం!” అనంతం కళవళపడ్తూ విన్నాడు. ఆ తర్వాత అనంతానికి ఎటు చూసినా జానకి స్వరూపమే. ఎక్కడ వినబోయినా జానకి మాటలే! అటుతర్వాత అనంతం ఏకాకిగానే వుండిపోయాడు.